క్లుప్తంగా

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో జీర్ణోద్ధరణ గావించిన శివకేశవ ఆలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనం, రక్షాబంధనం, దీక్షాధారసం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 16వ తేదీ వేదపారాయణం, రుద్రాభిషేకం, రుద్రహోమం, దీక్షా హోమాలు, దేవతామూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో చివరి రోజు 17వ తేదీ యంత్ర, విగ్రహ, ప్రాణప్రతిష్ఠ, బలిదానం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

18న జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

డోన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ స్థానిక గుండా వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మేళాలో టాటా క్యాపిటల్, పేటీఎం, క్రెడిట్ ఆక్టివ్ గ్రామీణ్ ప్రైవేట్ లిమిటెడ్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీయువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7981238237 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అంబేడ్కర్ సేవా రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక



మహేష్

కోవెలకుంట్ల: అంబేడ్కర్ సేవా రాష్ట్ర కార్యదర్శిగా కోవెలకుంట్లకు చెందిన మహేష్ ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఆ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివ ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు తన వంతు కృషి చేస్తానని మహేష్ పేర్కొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

బనగానపల్లె: మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి రూ.15 వేల విలువైన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్‌బాబు, రామచంద్రారెడ్డి, సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్: ప్యాపిలి మండలంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. వెంగళాంపల్లి గ్రామంలో 12 నెలల వేతనాలు రావాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శి కేవలం రెండు, మూడు నెలల వేతనాలు మాత్రమే చెల్లించారని తెలిపారు.

రేపటి నుంచి స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్

డోన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ నుంచి పట్టణంలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. శనివారం 11వ సచివాలయ పరిధిలోని గుంటూరు సుబ్బారావు వీధిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. పచ్చదనం పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పిస్తామన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పూర్తిగా దెబ్బతిన్న గోడలు, ఫ్లోరింగ్
- పెచ్చులూడిపడుతుండడంతో భయాందోళనలో పశువైద్య సిబ్బంది

అవుకు: మండల కేంద్రం అవుకులోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. ఆస్పత్రి లోపల, బయట ఉన్న గోడలకు పగుళ్లు ఏర్పడి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినింది. ఫ్లోరింగ్ బండలు భూమిలోకి కుంగిపోయాయి. అప్పుడప్పుడూ పెచ్చులూడి పడుతుండడంతో ఉద్యోగులు భయాందోళన మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రిలో పశువైద్యురాలితో పాటు అటెండర్, పశుమిత్ర విధులు నిర్వహిస్తున్నారు. అవుకు మండలంలో పాడిరైతులు అధికంగా ఉన్నారు. మండల కేంద్రంలో పశువైద్యశాల ఉండడంతో ప్రతి రోజూ పశువులకు వైద్య చికిత్స కోసం అధిక సంఖ్యలో పాడిరైతులు వస్తుంటారు. వచ్చిన ప్రతి ఒక్కరూ ఆస్పత్రి భవనాన్ని చూసి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ పశువులకు వైద్యం చేయించుకుని వెళ్తున్నారు. అంతేకాకుండా ఆస్పత్రి చుట్టూ కల్లాలు ఉండడంతో పాములు వస్తుంటాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చాలాసార్లు పాములు వచ్చిన సంఘటనలు ఉన్నాయన్నారు. దీనికితోడు ఆస్పత్రికి ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. రోజు సాయంత్రం పూట ఇక్కడే మద్యం సేవించి బాటిళ్లు, ఆహార వ్యర్థాలు పడేసి వెళ్తున్నారు. ఉదయాన్నే పశువైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి రాగానే ఆరుబయట మద్యం బాటిళ్లు, ఖాళీ వాటర్ ప్యాకెట్లు, తాగి పడేసిన గ్లాసులు దర్శనమిస్తుంటాయి. అధికారులు స్పందించి పశువైద్యశాల మరమ్మతులతో పాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అవుకు పశువైద్యశాల



గోడలకు ఏర్పడిన పగుళ్లు





పూర్తిగా దెబ్బతిన్న ఫ్లోరింగ్



ఆస్పత్రి ప్రాంగణంలో పడుకున్న మందుబాబు (ఫైల్)

15న రామలింగేశ్వరుని విగ్రహ ప్రతిష్ట

డోన్: పట్టణంలోని పాతపేట రామాలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి కావడంతో ఈ నెల 15వ తేదీ నుంచి రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం శివలింగ ప్రతిష్ఠ, 16వ తేదీ నవగ్రహాల ప్రతిష్ఠతో పాటు 108 కళశాలతో విగ్రహానికి అభిషేకాలు, 17వ తేదీ ఆలయ ఆవరణలో రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆలయానికి వంటపాత్రల విరాళం

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామంలోని రామాలయానికి ఎంఎస్ఆర్ రూరల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు గురువారం రూ. 10 వేలు విలువ చేసే వంటపాత్రలను అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన ఓ విద్యార్థినికి ల్యాప్‌టాప్ కొనుగోలుకు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, సభ్యులు బాలచంద్రారెడ్డి, అనితారెడ్డి, హనుమంతారెడ్డి, శైలజారెడ్డి, శారద, సత్యమ్మ పాల్గొన్నారు.



ఆలయానికి వంటపాత్రలు అందజేస్తున్న దృశ్యం

రోడ్డు నిర్మాణంతో కాలనీల్లో నీటి సమస్య

కొలిమిగుండ్ల: స్థానిక పోస్టాఫీసు సమీపంలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరా జరగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ సమీపం నుంచి పోస్టాఫీసు వరకు ఉపాధి హామీ నిధులతో డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణ పనులు చేసేందుకు సుమారు పదిహేను రోజుల క్రితం పనులు మొదలు పెట్టారు. ఆయా కాలనీలకు నీటి సరఫరా అందించే పైపులైన్‌లను తొలగించారు. రెండు మూడు రోజుల పాటు ట్యాంకర్లతో నీటి సరఫరా అందించి ఆ తర్వాత వదిలేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునే కాలనీ, పోస్టాఫీసు ప్రాంతాల్లో ప్రజలకు నీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది రామసుబ్బారెడ్డి హస్పటల్ వద్ద ఉన్న మినీ ట్యాంక్‌ల నుంచి మోసుకెళుతున్నారు. తాత్కాలికంగా రింగ్ పైపుతో నీటి సరఫరా చేస్తున్నా కొంత మంది మోటర్లు వేసుకోవడంతో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు వాపోతున్నారు. ఎక్కువ భాగం ఈ కాలనీల్లో కూలీ పనులకు పోతుంటారు. పనుల నుంచి ఇంటికి వచ్చే సరికి నీళ్లు ఉండని పరిస్థితి ఏర్పడుతోందని మహిళలు వాపోతున్నారు. డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, సీసీరోడ్డు వేసి క్యూరింగ్ చేసే సరికి ఇంకా నెల సమయం పట్టే అవకాశం ఉందని కాలనీవాసులు తెలిపారు. కాలనీల్లో నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

డోన్: కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 9వ తేదీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నిఖిల్ కటా పోటీలో సిల్వర్, 7వ తరగతి విద్యార్థులు చరణ్‌దీప్, అభిరాం బ్రాంజ్ పతకాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమా రెడ్డి, కరాటే మాస్టర్ రమణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

స్త్రీనిధి రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి

బనగానపల్లె రూరల్: డ్వాక్రా మహిళలు స్త్రీనిధి కింద తీసుకున్న రుణాల రికవరీపై వెలుగు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పథకం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో స్త్రీనిధి రుణాలు, రికవరీ తదితర అంశాలపై డీఆర్‌డీపీ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. స్త్రీనిధి పథకం కింద తీసుకున్న రుణాలను కొందరు 2, 3 ఏళ్ల నుంచి చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మండలంలో సుమారు 20 గ్రామైక్య సంఘాల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై సీసీలు, బుక్‌కీపర్లు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి ఈనెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. స్త్రీనిధి పథకం మేనేజర్ నాగ ప్రసాద్, ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్త్రీనిధి పథకం అసిస్టెంట్ జనరల్ మేనేజర్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సంజీవనగర్, జంగాలపేట కాలనీలను సందర్శించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య ఉందని.. 15 రోజులకు ఒక్కసారి నీరు వస్తోందని స్థానికులు విన్నవించారు. స్పందించిన చలంరెడ్డి పట్టణంలోకి వస్తున్న గోరుకల్లు రిజర్వాయర్ పైపులైన్ నుంచి కాలనీవాసులకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేద్దాం

బేతంచెర్ల: కర్నూలు పట్టణంలో ఈనెల 23వ తేదీ తలపెట్టిన మాలల యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని ముసలాయి చెర్వు గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మాల మహానాడు డోన్ నియోజకవర్గ కన్వీనర్ మునిస్వామి, సంఘం సభ్యులు రాజశేఖర్, రాం సుబ్బయ్య, మద్దిలేటి, సుమంత్ పాల్గొన్నారు.

రైతులను మభ్యపెట్టడానికే ఫార్మర్ రిజిస్ట్రీ

డోన్ టౌన్: రైతులను మభ్యపెట్టడానికే కూటమి ప్రభుత్వం రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సీపీఎం మండల కార్యదర్శి కొయికొండ నాగరాజు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, చిన్న రహిమాన్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేయడానికే ఫార్మర్ రిజిస్ట్రీ తీసుకొచ్చినట్లు ఉందన్నారు. వివరాలు నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కందికి మద్దతు ధర ఇవ్వాలన్నారు.

అటవీ సంపదను దోచుకునేందుకే కగార్

డోన్ టౌన్: అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేసేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులు, ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారం రంగనాయకులు ఆరోపించారు. గురువారం పట్టణంలో నిరసన తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు దొరపల్లె రాజు, ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కుమ్మరి కేశాలు (67) ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె వద్ద బుధవారం లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుమ్మరి కేశాలు కుటుంబ సభ్యులకు గురువారం సీఐటీయూ తరఫున ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం రూ.5 వేల విరాళాన్ని అందజేశారు. బేతంచెర్లలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆటో డ్రైవర్లు మద్దయ్య, డోన్ చిన్న, వేణుకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న జయమ్మ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ హోటల్‌లో కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. సాయంత్రం హోటల్‌లో పని ముగించుకుని ఇంటికి బయల్దేరింది. డిగ్రీ కళాశాల వద్ద కర్ణాటకకు చెందిన ఓ లారీ రోడ్డు కుడివైపు నుంచి ఎడమవైపు వచ్చే క్రమంలో పక్కనే నడిచి వెళ్తున్న జయమ్మను తాకింది. దీంతో ఆమె కిందపడిపోయింది. ఆమెపై నుంచే వాహనం వెళ్లడంతో కడుపు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ గమనించి వాహనం అక్కడే నిలిపివేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. గాయపడిన మహిళను స్థానికులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మహిళలు చదువుతోపాటు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని పూదోట మఠం ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాల్, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గొరిపేట కాలనీకి చెందిన తలారీ నాగలక్ష్మికి కుట్టు మిషన్‌ను ఉచితంగా అందజేశారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

బేతంచెర్ల: ప్రణాళికతో చదివితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం బేతంచెర్ల మండలం గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్, సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడిందని.. విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచించారు. తెలియని విషయాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితేనే ఎక్కువ మార్కులు సాధించవచ్చని తెలిపారు. కాగా మోడల్ స్కూల్‌లో స్టడీ అవర్‌ను పర్యవేక్షించాల్సిన బయాలజీ సబ్జెక్టు టీచర్స్ ఇద్దరు రాకపోవడంతో మెమో ఇచ్చారు. ప్రిన్సిపాల్ మానిటరింగ్ లోపం ఉందని ఆయనకూ మెమో జారీ చేశారు.

ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన



నాణేల గురించి వివరిస్తున్న అధ్యాపకుడు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ బడేసాహెబ్ ఆధ్వర్యంలో గురువారం పురాతన నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ.. విద్యార్థులు వివిధ దేశాల కరెన్సీ, నాణేలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రదర్శనలో 1835 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ జారీ చేసిన అర అనా నాణెంతో పాటు పలు దేశాల కరెన్సీ, నాణేలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన బడేసాహెబ్‌ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రామకృష్ణ, నీతమ్మ, కౌసల్యదేవి, వరలక్ష్మీ, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామస్తుల ఆరాధ్య దైవం హజరత్ వన్నూర్ వలీ స్వామి గంధోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ముల్లా వన్నూర్ బాషా ఇంటి నుంచి హజరత్ వన్నూర్ వలీ స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల నడుమ దర్గాకు తీసుకొచ్చారు. భక్తిశ్రద్ధలతో గంధం సమర్పించారు. చుట్టుపక్క ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన ఆలయం



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం బాబా విగ్రహం ప్రాణ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేశారు. ఈ సందర్భంగా హోమాలు, జపాలు, పూర్ణాహుతి తదితర కార్యాక్రమాలు చేశారు. అనంతరం బాబాకు మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు : సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కేఈ శ్యాంబాబు, గౌరు చరిత, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, టీడీపీ నాయకులు కేఈ ప్రతాప్, గౌరు వెంకటరెడ్డి, జగత్‌విఖ్యాత్‌రెడ్డి తదితరులు హాజరై సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు, స్వచ్ఛంద సేవకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.



సాయిబాబాకు హారతి ఇస్తున్న అర్చకుడు



ధర్మకర్తలకు రూ.50వేల విరాళాన్ని అందజేస్తున్న మేకల అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు

ఆలయానికి రూ.50 వేల విరాళం

డోన్: షిర్డీ సాయిబాబా ఆలయానికి దాతలు గురువారం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. డోన్‌లోని న్యూ సాయి ఆటో బాడీ వర్క్స్ యజమాని మేకల అశోక్ కుమార్, లక్ష్మి దంపతులతో పాటు వారి కుమార్తెలు కీర్తి, లావణ్య రూ.50 వేలను ఉత్సవ కమిటీ సభ్యుడు ధర్మవరం సుబ్బారెడ్డికి అందజేశారు. కమిటీ సభ్యులు సీఎం శ్రీను, కొండా సురేష్, ఆలా మల్లికార్జున రెడ్డి, పార్థ, సుబ్బారెడ్డి, వెంకటేష్, శ్రీరాములు పాల్గొన్నారు.